క్లుప్తంగా

తైక్వాండోలో విద్యార్థి ప్రతిభ



దుర్గా అభినయ్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

అల్లవరం: జేఎన్‌టీయూకే పరిధిలో చీరాలలో జరిగిన తైక్వాండో క్రీడల్లో అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎం దుర్గా అభినయ్ ప్రతిభ చాటి రెండో స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి శనివారం తెలిపారు. జేఎన్‌టీయూకే పరిధిలోని 188 కళాశాలల నుంచి విద్యార్థులు ప్రాతినిధ్యం వహించగా బీవీసీ విద్యార్థి ద్వితీయ స్థానం సాధించాడన్నారు. క్రీడాకారుడు దుర్గా అభినయ్‌ని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

30న దిశ కమిటీ సమావేశం

అమలాపురం రూరల్: ఈ నెల 30న అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహిస్తునట్లు జిల్లా కలెక్టర్, పర్యవేక్షణ కమిటీ మెంబర్ సెక్రటరీ ఆర్. మహేష్ కుమార్ శనివారంలో ఒక ప్రకటనలో తెలిపారు. దిశ కమిటీ అధ్యక్షుడు ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల పురోగతిపై సమావేశంలో సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి దిశ కమిటీ గౌరవ సభ్యులు, కోనసీమ జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అల్లవరం: కొమరగిరిపట్నం సముద్ర తీర ప్రాంతం నుంచి అనధికారికంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనధికార ఇసుక తరలింపుపై అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అధికారులు అప్రమత్తమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు: మండల పరిధిలోని 216 జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కోరింగి ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సూర్య హాస్పిటల్ పక్కన ఉన్న ఐస్ ఫ్యాక్టరీ నుంచి ఖాళీ కంటైనర్ లారీ వేగంగా రోడ్డుపైకి రావడంతో యానాం నుంచి మోటార్ సైకిల్‌పై పెద్దాపురం వెళుతున్న వ్యక్తులు అదుపు తప్పి కంటైనర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పెద్దాపురంకు చెందిన బుర్ర అనిల్ తీవ్రంగా గాయపడగా, మేక రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం




దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

ఐ పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కు శనివారం ఏలూరు గ్రామానికి చెందిన ప్రగలపాటి సుధాకర్ దంపతులు రూ.10,116లు విరాళాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. వీరికి ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు ప్రత్యేక దర్శనం, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేసి సత్కరించారు. నిత్యం స్వామి ఆలయంలో రాత్రి కల్యాణానికి విచ్చేసే భక్తులకు శ్రీవీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌ద్వారా నిత్యాన్నదాన పథకాన్ని దేవస్థానం అమలు చేస్తోంది.

పశువుల సంచారంతో ఇక్కట్లు

విద్యార్థులు, వాహన చోదకుల వెతలు



ఎంజీజీ బాలుర ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో తిష్ట వేసిన పశువులు

యానాం: పట్టణ పరిధిలో విచ్చలవిడిగా పశువులు సంచరిస్తుండటంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత పశువుల యజమానులు తమ పశువులను వీధుల్లో వదిలి వేస్తున్నారని అవి కాస్తా రోడ్లపై నిద్రిస్తూ స్పీడ్ బ్రేకర్స్‌లా మారాయని స్థానికులు వాపోతున్నారు. శనివారం స్థానిక మహాత్మా గాంధీ ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో పశువులు తిష్ట వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఆవులు, ఎద్దులు అధిక సంఖ్యలో వచ్చి గ్రౌండ్‌లో కదలకుండా ఉండటంతో విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి వీలు లేకుండా పోయింది. ఈ సమస్యను పరిష్కరించాలని మున్సిపాలిటీ యంత్రాంగాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధి కల్పనకు శ్రీకారం

- పనుల ప్రణాళిక తయారీలో యంత్రాంగం నిమగ్నం
- ప్రజలు, రైతులు కోరుకునే పనులకే ప్రాధాన్యం
- గ్రామసభల నిర్వహణకు సమాయత్తం



అమలాపురంలో కొబ్బరి చెట్లకు పళ్లాలు వేస్తున్న కూలీలు

అమలాపురం రూరల్: పల్లెల్లో ఉపాధి పనుల ప్రణాళికల తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి గానూ గ్రామాల్లో చేపట్టబోయే పనుల గుర్తింపునకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం గ్రామసభలు నిర్వహిస్తున్నారు. రైతులు, గ్రామస్తులు తమకు అవసరమైన పనులను ఎంపిక చేసుకుని గ్రామసభల్లో దరఖాస్తు చేసుకునే వెసులు బాటు కల్పించారు. ఎంపిక చేసిన పనులపై ప్రతిపాదనలు రూపొందించి, మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.

పనుల వివరాలు

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో పనుల గుర్తింపు చేపడుతున్నారు. ముందుగా తయారు చేసుకున్న ప్రణాళికల ఆధారంగా సకాలంలో పనులు చేస్తున్నారు. ఈ పనుల నిర్వహణకు గ్రామసభలే కీలకం. ఉపాధి హామీలో భాగంగా వేతన దారులకు అధిక పని దినాలు కల్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఏటా గ్రామాల్లో చేపట్టబోయే పనులను ముందుగానే గుర్తిస్తారు. ఇందులో మొత్తం 25 రకాల పనులు ఉంటాయి. వాటిలో మనకు ఏ పనులు అనుకూలంగా ఉన్నాయనేది గుర్తించి వాటిని అధికారులకు తెలియ జేయాలి. ఉపాధి హామీ పథకం అధికారులు మండలాల వారీగా ఇప్పటికే గ్రామసభల షెడ్యూల్ రూపొందించారు. ఇంకుడు గుంతలు, కంపోస్టు యార్డు, ఫారం పాండ్స్, సామూహిక ఇంకుడు గుంతలు, ఉద్యానవన అభివృద్ధి, శ్మశాన వాటికలు, రైతులు పొలాలకు వెళ్లే రహదారులు, పంట పొలాల్లో పూడికతీత, మంచినీటి చెరువుల్లో పూడికతీత, మొక్కలు నాటడం, కొబ్బరి చెట్లకు రింగ్ ట్రెంచి పనులు చేపట్టనున్నారు.

క్లస్టర్ పరిధిలో గ్రామ సభలు

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఆరు మండలాల పరిధిలో గ్రామాల్లో ఉపాధి పనులు చేపడతారు. 153 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. షెడ్యూల్ ఆధారంగా ఈ నెల రెండో తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరు వరకూ నిర్వహించే సాధారణ గ్రామసభల్లో ఉపాధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తారు. ఈ గ్రామసభ నివేదికలను అనుసరించి గ్రామం నుంచి వచ్చిన వినతులకు వచ్చే నెలలో మండల పరిషత్, అనంతరం జిల్లా పరిషత్ ఆమోదానికి పంపిస్తారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో మండల ప్రణాళికలపై ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో కొత్త ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 23.91 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యం కాగా ఇప్పటికి వరకు రూ.18.15 లక్షల పని దినాలు కల్పించారు. వేతనాల రూపంలో ఇప్పటి వరకూ రూ.5.37 కోట్లు చెల్లించారు. 18.91 లక్షల మంది కూలీలకు పని దినాలు కల్పించారు. రోజుకు ప్రతి వేతన దారుడికి సగటు రూ.300లు వేతనం అందిస్తున్నారు.

ప్రతి కుటుంబానికి ఉపాధి



ప్రస్తుతం గ్రామసభల ద్వారా గుర్తిస్తున్న పనులను పంచాయతీల్లో తీర్మానాలు తీసుకునే పనిలో ఉన్నాం. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి గుర్తించిన పనులను ప్రారంభిస్తాం. తీర్మానాల్లో గుర్తించిన పనులకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారుల ఆమోదాన్ని తీసుకుంటాం. ప్రతి కుటుంబానికి ఉపాధి పనుల కల్పనే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నాం.

డి. రాంబాబు, ఏపీడీ, అమలాపురం.

ప్రజా భాగస్వామ్యానికి ప్రాధాన్యం



ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల పనులు చేపడుతున్నాం. గ్రామసభల ద్వారా ప్రజలు, రైతులు సూచించిన పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహిస్తున్నాం. కూలీలకు పనులు కల్పించేందుకు కృషి చేస్తాం.

ఉండ్రు బాబ్జిరాజు, ఎంపీడీవో, అమలాపురం.

విద్యార్థినులకు బస్ పాస్‌లు పంపిణీ



బస్ పాస్‌లు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు వాకర్స్ హెల్త్ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్‌పాస్‌లు అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జగతా పద్మనాభం చేతుల మీదుగా వీటిని అందించారు. వాకర్స్ క్లబ్ ఆర్థిక సాయంతో వీటికి లామినేషన్, ట్యాగ్‌లు అమర్చి సుమారు 300 వందల మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ పరిమళ, వాకర్స్ క్లబ్ కార్యదర్శి యేడిద దొరబాబు, నార్ని కృష్ణ, శేట్ రాజీవ్, పసుమర్తి వెంకన్న బాబు, చెల్లూరి షణ్ముక చారి, పసుమర్తి రామారావు పాల్గొన్నారు.

పశు గణన పోస్టర్ల ఆవిష్కరణ

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు గ్రామంలో సర్పంచ్ అరుణకుమారి ఆధ్వర్యంలో పశు గణన కార్యక్రమం శనివారం జరిగింది. గ్రామంలో గేదెలు, ఆవులు, మేకలు, పందులు, కోళ్లు మొదలైన 16 రకాల పెంపుడు జంతువుల వివరాలను సచివాలయం సిబ్బంది సేకరించారు. ఈ సందర్భంగా పోస్టర్లను సర్పంచ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, ఆదినారాయణ, సక్కా చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణతో అధికాదాయం



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోస్‌బాబు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసుబాబు

అమలాపురం రూరల్: వరి సాగులో యాజమాన్య సస్య రక్షణ పద్ధతులను రైతులు తప్పని సరిగా పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి బోసుబాబు రైతులకు సూచించారు మండల పరిధిలోని సమనస రైతు సేవా కేంద్రంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏం ఏ షంషి అధ్యక్షతన అమలాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అమలాపురం, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు వరి పంటలో సమగ్ర సస్య రక్షణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్ల నుంచి కొనసాగుతున్న ఉచిత పంటల బీమా పథకంలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసిందన్నారు. రబీ నుంచి రైతులు తమ వాటా ప్రీమియాన్ని తామే చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మనోహర్ పలు అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మండలాల వ్యవసాయ అధికారులు కడలి ధర్మ ప్రసాద్, ఎన్‌వీవీ సత్యనారాయణ, వై శోభ, జి.కుమార్ బాబు, మండలాల వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

జూనియర్ ఇంజినీర్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లలో ఖాళీగా ఉన్న పీడబ్ల్యూడీ ఇంజినీరు(సివిల్) పోస్టుల ఖాళీకి ఈ నెల 27న 6 సెంటర్లలో నిర్వహిస్తున్న పోటీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శనివారం అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ ఆఫీసర్ పంకరాజ్ కుమార్ తెలిపారు. పేపర్–1 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, పేపర్ –2 పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు జరుగుతుందన్నారు. నాలుగు రీజియన్‌లకు కలిపి 1,851 మంది పరీక్షకు హాజరు కానున్నారని వీరిలో మహిళా అభ్యర్థులు 416 మంది, పురుష అభ్యర్థులు 1,435 మంది ఉన్నారన్నారు. అభ్యర్థులు వచ్చేటప్పుడు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఫింగర్ ప్రింట్ రిజిస్ట్రేషన్ ఉంటుందని వివరాలకు 0413–2233338 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఎల్జీ కైలాశ్‌నాథ్‌తో మల్లాడి భేటీ



పుదుచ్చేరి ఎల్జీ కైలాశ్‌నాథన్‌కు వినతిపత్రం అందిస్తున్న మల్లాడి

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె కైలాశ్ నాథన్‌తో శనివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు రాజ్‌నివాస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఎంబీబీఎస్ సీట్లలో యానాం రీజియన్ రిజర్వేషన్‌కు సంబంధించి 2001 జనాభా కాకుండా 2024 జనాభాను పరిగణనలోకి తీసుకోవడం వల్ల నియోజకవర్గ పరిధిలో యానాంలోని ఓబీసీల్లో పలు కులాల వారికి మెడిసిన్ సీట్లు దక్కకుండా అన్యాయం జరుగుతుందని ఎల్జీకి వివరించారు. ఎల్జీ స్పందించి ఆరోగ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను నివేదిక కోరినట్లు మల్లాడి తెలిపారు. పలు పెండింగ్ అంశాలపై సైతం చర్చించారు. నవంబర్ చివరి వారంలో యానాం పర్యటనకు ఎల్జీ కైలాశ్‌నాథన్ రానున్నారని మరో నాలుగు రోజుల్లో అధికారికంగా పర్యటన ఖరారవుతుందని వెల్లడించారు.

నవంబర్14 నుంచి బియ్యం పంపిణీ

యానాం: రేషన్ షాపుల ద్వారా నవంబర్ 14 నుంచి ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభమవుతుందని పుదుచ్చేరి సీఎం రంగసామి ప్రకటించారు. శనివారం ఆయన మాట్లాడుతూ నాలుగు రీజియన్‌ల పరిధిలోని రేషన్ షాపులలో ఉచిత బియ్యం పంపిణీ జరుగుతుందని దీనిపై ఎటువంటి అనుమానాలకు తావు లేదన్నారు. రేషన్ షాపులు అందుబాటులో లేనిచోట స్కూల్స్, అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ అవుతుందన్నారు.

ఉపాధ్యాయులు ఓటు వినియోగించుకోవాలి



అమలాపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న బొర్రా గోపీ మూర్తిని గెలిపించేందుకు పట్టణంలోని ఉపాధ్యాయులంతా తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో శనివారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఓట్లు అభ్యర్థించారు. అమలాపురంలో మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ జాన్స్ స్కూలు, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో ఆయా పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపెయిన్లు నిర్వహించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులతో సమావేశమయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాలను ఎమ్మెల్సీ తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనాన్ని నాణ్యతతో అందించాలని సూచించారు.

వీరభద్రరావు సేవలు మరువలేనివి



వీరభద్రరావును సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో రెండేళ్ల పాటు పర్యవేక్షణాధికారిగా పనిచేసి పిఠాపురం దేవస్థానానికి బదిలీపై వెళ్లనున్న బొల్లం వీరభద్రరావును శనివారం ఆలయ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వివాద రహితుడిగా అందరి మన్ననలు పొంది ఆలయ అభివృద్ధికి తనకు తోడ్పాటు అందించారని అన్నారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం ఆనందంగా ఉందని శాసన సభ్యులు, మాజీ చైర్మన్లు, అర్చకులు, గ్రామస్తులు ఎంతగానో సహకరించారన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మెన్ కళారి రామవెంకట సుబ్బరాజు, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, వేదపండితులు గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి, స్వస్తి వాచకులు నాగాభట్ల రవిశర్మ పాల్గొన్నారు.

పశు గణనకు సహకరించండి



పశు గణన పోస్టర్లు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, అధికారులు

అమలాపురం టౌన్: పట్టణంలో పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తున్న పశు గణన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పిలుపు నిచ్చారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాకులు డాక్టర్ ఎల్. విజయరెడ్డి ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది పట్టణంలో చేపట్టిన పశు గణన కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ నాగేంద్రమణి కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్, కమిషనర్, ఆ శాఖ సహాయ సంచాలకులు మున్సిపాలిటీకి సంబంధించిన పశు గణన పోస్టర్లను విడుదల చేశారు. సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో 865 ఆవులు, 918 గేదెలు, 320 గొర్రెలు, 120 పందులు, 1200 కుక్కలు ఉన్నాయని చెప్పారు. ప్రతీ ఒక్కరూ తాము పెంచుతున్న జంతువుల సమాచారాన్ని పశు గణన సిబ్బందికి అందించాలని కమిషనర్ రాజు సూచించారు. పశు గణన చేస్తున్న వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంచార విజ్ఞాన ప్రదర్శన



సంచార విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

ఐ పోలవరం: మండల పరిధిలోని ఐ పోలవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం అమలాపురం బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ సెల్యూలర్ అండర్ మాలిక్యులర్ బయాలజీ, బెంగుళూరు ఆధ్వర్యంలో సంచార విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. జన్యు సంక్రమణం, జన్యు రుగ్మతలు, జన్యు మార్పులు, ఉత్పరి వర్తనాలు, హిమోఫీలియా, థీటా తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వంటి విషయాల గూర్చి టెక్నీషియన్స్ ప్రవీణ్‌రాజు, బి రామకృష్ణ, పి కృష్ణ, ఎస్ తిరుసెల్వం వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీధి సురేష్‌బాబు, పాపారావు, ఆకుల వెంకటేశ్వరరావు, మొల్లేటి శాంతకుమార్, సతీష్ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆందోళన



మున్సిపల్ కమిషనర్ రాజుతో చర్చిస్తున్న యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ పారిశుధ్య విభాగం(క్లాప్)లో పని చేస్తున్న ఆటో, టిప్పర్ డ్రైవర్లు గత మూడు నెలలుగా జీతాలు లేక ఆందోళన బాట పట్టారు. తమకు పెండింగ్ జీతాలను ఇచ్చి ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఆందోళన బాట పట్టిన క్లాప్ డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులతో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు శనివారం ఉదయం చర్చించారు. వేతనాల బకాయిల చెల్లింపునకు సోమవారం వరకు గడువు ఇవ్వాలని కమిషనర్ వారిని కోరారు. సోమవారం నాటి గడువుకు అంగీకరిస్తూనే ఆ లోపు సమస్యను పరిష్కరించకపోతే తమ కుటుంబ సభ్యుల ఆకలి తీర్చమని వేడుకుంటూ ఇళ్లలోనే కుటంబీకులంతా నిరాహార దీక్షలకు కూర్చుంటారని ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు కమిషనర్‌కు స్పష్టం చేశారు. తద్వారా డ్రైవర్ల కుటుంబాలు జీతాలు అందక పడుతున్న బాధలను నేరుగా ప్రభుత్వానికి తెలియజేస్తారని స్పష్టం చేశారు. మిగిలిన మున్సిపల్ డ్రైవర్లకు జీతాలు ఎలా బట్వాడా చేస్తున్నారో అలానే క్లాప్ డ్రైవర్లకు కూడా చెల్లించాలని కోరారు. కమిషనర్‌తో జరిగిన చర్చల్లో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుంచే అరుణ కుమార్, సంఘం ప్రతినిధులు యనమదల మురళీకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

స్థూలకాయంపై అవగాహన



స్థూలకాయంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

యానాం: యానాం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం స్థూలకాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేచురోపతి, ఆయుర్వేదిక్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో నేచురోపతి, యోగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి చంద్రలక్ష్మి మాట్లాడుతూ స్థూలకాయం అనేది శరీరంలో అవసరానికి మించి కొవ్వు చేర్చి ఆరోగ్యానికి హాని చేస్తుందన్నారు. ఒక వ్యక్తి ఎత్తుకు, బరువుకు గల సంబంధాన్ని చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ప్రాధాన్యత, జన్యు కారణాలు, రుగ్మతలు, నివారణోపాయాలు తదితరమైన వాటి గూర్చి వివరించారు. ఆయుష్ ఆసుపత్రిలో రోగులకు స్థూలకాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ప్రధాన వైద్యాధికారి స్టాన్లీ స్టీవెన్‌సన్, డాక్టర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ శిల్పకళా మేళాలో వీరనాట్యం, గరగ నృత్యం

కొత్తపేట: రాజస్తాన్ స్టేట్ జైపూర్ శిల్పకళా మేళా కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వీరనాట్యం, గరగ నృత్యం బృందాలు పాల్గొన్నాయి. రాజస్తాన్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జైపూర్ జవహర్ కళా కేంద్రంలో ఈనెల 18 నుంచి 28 వరకూ జరిగే శిల్పకళా మేళాకు దేశ వ్యాప్తంగా వివిధ కళారూపాల నృత్య ప్రదర్శనల బృందాలను ఎంపిక చేశారు. దానిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తపేట మండం పలివెల గ్రామానికి చెందిన కళాస్రవంతి సంగీత, వాయిద్య, నృత్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమారిపాటి ఏసువెంకటప్రసాద్ ఆధ్వర్యంలోని వీరనాట్యం, గరగనృత్యం ప్రదర్శనలు ఎంపిక చేశారు. ఆయా బృందాల నుంచి 15 మంది కళాకారులు పాల్గొని శుక్రవారం వీరనాట్యం, శనివారం గరగ నృత్యం ప్రదర్శించి, ప్రేక్షకులను మెప్పించారు. వారికి నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు.



జైపూర్‌లో గరగ నృత్యం ప్రదర్శిస్తున్న ప్రసాద్ బృందం